


ఐటిసిఎక్స్ కార్యక్రమంలో సిఎం చంద్రబాబునాయుడు

అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలి..

- మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలి
- పరిష్కరించకపోతే 10న చలో విజయవాడ

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని రాష్ట్రవ్యాప్త ధర్నాలో భాగంగా సోమవారం చిత్తూరు కలెక్టరేట్ ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు వాడ గంగరాజు, జిల్లా కార్యదర్శి షకీలా ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వ హయాంలో అంగన్వాడీల సమస్యలపై 42 రోజులపాటు రాష్ట్రవ్యాప్తంగా అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు చారిత్రాత్మకమైన పోరాటం చేపట్టారని, సుదీర్ఘ పోరాట సందర్భంలో జులైలో వేతనాలు పెంచుతామన్నారని, మరో 11 డిమాండ్లను పరిష్కరిస్తామని మినిట్స్ కాపీ ఆధారంగా హామీ ఇచ్చారని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన అనంతరం మినిట్స్ కాపీ హామీలు అమలు చేయాలని కోరుతూ అనేక దఫాలుగా ముఖ్యమంత్రిని, పలువురు మంత్రులకు విన్నవించుకున్నా ఒక్క సమస్య కూడా పరిష్కారం కాలేదని అన్నారు. అంగన్వాడీల సమస్యలను పరిష్కరించే దిశగా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టకపోవడం అన్యాయమని మండిపడ్డారు. సుప్రీం కోర్టు అంగన్వాడీలు గ్రాట్యూటీకి అర్హులని 2022లో తీర్పు ఇచ్చిందని, చంద్రబాబు ప్రభుత్వం మేనిఫెస్టోలో అంగన్వాడీలకు గ్రాట్యూటీ అమలు చేస్తామని హామీ ఇచ్చి నేటి వరకు పూర్తిగా విస్మరించారని విమర్శించారు. అలాగే ఏజెన్సీ ప్రాంతాలలో దాదాపుగా 5600 మినీ సెంటర్లు ఉన్నాయని, మినీ వర్కర్లకు తక్కువ వేతనం ఇస్తూ ఎక్కువ పనిభారాలు వేస్తున్నారని, మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలని ప్రభుత్వ సర్వేలు నివేదికలు అందిస్తున్నా ప్రభుత్వం మాత్రం జీవోను విడుదల చేయడంలో


కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న అంగన్వాడీలు

పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని తెలిపారు. ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తున్నామంటున్న ప్రభుత్వం అంగన్వాడీలకు ఎందుకు అందించడం లేదని ప్రశ్నించారు. కావున పెండింగ్లో ఉన్న సెంటర్ బిల్లులు, టిఏ బిల్లులు, కావెంట్, ఈవెంట్ బిల్లులు వెంటనే విడుదల


శాంతిపురంలో..

చేయాలన్నారు. అలాగే రానున్న బడ్జెట్ సమావేశాల్లో అంగన్వాడీ సమస్యలపై చర్చించాలని, వారికి జీతాలు పెంచాలి, మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్పు చేస్తూ జీవోలు విడుదల చేయాలని, హెల్పర్ల ప్రమోషన్లలో రాజకీయ జోక్యం ఆపాలని డిమాండ్ చేశారు. ధర్నాలో అంగన్వాడీ జిల్లా నాయకులు సుజిని, మమత, పెద్ద సంఖ్యలో అంగన్వాడీలు పాల్గొన్నారు.

బంగారుపాళ్యం: అంగన్వాడీల సమస్యలపై ప్రభుత్వం తక్షణం స్పందించి పరిష్కరించాలని కోరుతూ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు సోమవారం మండల కేంద్రంలోని ఐసిడిఎస్ కార్యాలయంలో నిరసన తెలిపారు. అనంతరం అంగన్వాడీలు లక్ష్మీ, రాధిక, రత్న కుమారి, విమల, భారతిలు సిడిపిఓ వాణి శ్రీదేవికి వినతిపత్రం అందజేశారు.


బంగారుపాళ్యంలో..

వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఐదు సంవత్సరాల లోపు పిల్లలను అంగన్వాడీ కేంద్రాల్లో ఉండాలని జీవో విడుదల చేయాలని, వేతనం కూడిన మెడికల్ లీవ్‌లు మూడు నెలలకు పెంచాలని, మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలని, బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. చంద్రకళ, హారిక, హేమ, విజయ కుమారి, నాగరాజమ్మ, మమత, లక్ష్మీ ప్రసన్న, స్వర్ణ పాల్గొన్నారు.

కార్వేటినగరం: అంగన్వాడీ వర్కర్లకు, హెల్పర్లకు వేతనాలు పెంచి, గ్రాట్యుటీ అమలు చేయాలని అంగన్వాడీ యూనియన్ జిల్లా అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు విజయ, మమత డిమాండ్ చేశారు. సోమవారం మండల కార్యాలయం ఆవరణంలో అంగన్వాడీ


పలమనేరులో..

వర్కర్లు తమ డిమాండ్లను పరిష్కరించాలని నిరసన తెలిపారు. అనంతరం ఎంపీడీవో చంద్రమౌళికి డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందించారు. వారు మాట్లాడుతూ పెరుగు నిత్యావసర వస్తువుల ధరలను దృష్టిలో ఉంచుకుని కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, గ్రాట్యుటీ అమలు చేయాలని, సర్వీసులో ఉండి మృతి చెందిన వారికి దహన సంస్కారాలకు రూ.20 వేలు అందించాలని, పెండింగ్లో ఉన్న సెంటర్ అద్దెలు, టీఏ బిల్లులూ వెంటనే ఇవ్వాలని, అన్ని యాప్పులు కలిపి ఒకే యాప్ మార్పు చేయాలని, పెండింగ్లో ఉన్న 164 సూపర్వైజర్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం.

పలమనేరు: స్థానిక ఐసిడిఎస్ కార్యాలయం వద్ద అంగన్వాడీల జీతాలు పెంచాలని, సమస్యలు పరిష్కరించాలని, రాష్ట్ర బడ్జెట్ సమావేశాలలో ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలని అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) నాయకులు డిమాండ్ చేశారు. తమ సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అంగన్వాడీలు మంజుల, కవిత, కృష్ణవేణి, శుభలక్ష్మి, శుభమ్మ, సుమలమ్మా, సుజనా, చంద్రమ్మ పాల్గొన్నారు.

శాంతిపురం: తాము అధికారం చేపట్టిన మూడు నెలల్లోనే అంగన్వాడీల సమస్యలను పరిష్కరిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని అంగన్వాడీ వర్కర్లు డిమాండ్ చేశారు. సోమవారం శాంతిపురం ఐసిడిఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని శాంతిపురం, రామకుప్పం మండలాల అంగన్వాడీ వర్కర్లు మండల సచివాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. అనంతరం సిడిపిఓ కల్పనకు వినతి పత్రాన్ని అందజేశారు. యూనియన్ నాయకులు శోభ, శైలజ, ఎర్రమ్మ, గీతాంజలి, పలువురు అంగన్వాడీలు పాల్గొన్నారు.

బైరెడ్డిపల్లి : బైరెడ్డిపల్లి ఐసిడిఎస్ ప్రాజెక్ట్ పరిధిలో పనిచేస్తున్న అంగన్వాడీలు తమ సమస్యలపై ప్రభుత్వం స్పందించాలని కోరుతూ సోమవారం సిడిపిఓకు వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ కనీస వేతనం రూ.25వేలు ఇవ్వాలని, పెండింగ్ బకాయిలు చెల్లించాలని, మెడికల్ లీవ్ వేతనంతో మూడు నెలలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు శ్యామల, భువనేశ్వరి, అంగన్వాడీలు పాల్గొన్నారు.


బైరెడ్డిపల్లిలో..

టెంపుల్ కన్వెన్షన్‌తో సనాతన ధర్మ పరిరక్షణ

'ఐటిసిఎక్స్ -2025'లో సిఎంలు

ప్రజాశక్తి - తిరుపతి (మంగళం)

టెంపుల్ కన్వెన్షన్‌తో సనాతన ధర్మాన్ని పరిరక్షిస్తామని వక్తలు ఉద్ఘాటించారు. దేవాలయాల అభివృద్ధి కోసం ప్రజల నుండి ఐవిఆర్ఎస్ కాల్స్ ద్వారా అభిప్రాయ సేకరణ తీసుకుంటామన్నారు. తదనుగుణంగా మంచి సలహాలతో ఆలయాల నిర్వహణ మరింత పకడ్బందీగా నిర్వహిస్తామన్నారు. ఇందుకోసం టెక్నాలజీని పూర్తిస్థాయిలో వినియోగించడానికి కార్యచరణ సిద్ధం చేస్తున్నామన్నారు. ఇంటర్నేషనల్ టెంపుల్ కన్వెన్షన్ అండ్ ఎక్స్‌పో -2025ను ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సోమవారం సాయంత్రం కరకంబాడి మార్గంలోని ఆశా కన్వెన్షన్ సెంటర్‌లో జ్యోతి ప్రజ్వలనం చేసి ప్రారంభించారు. ఈ ఎక్స్ పో ప్రారంభోత్సవానికి మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్, గోవా ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్ హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ సనాతన భారతదేశంలో ఆలయాల నిర్వహణపై ఇంత పెద్ద స్థాయిలో చర్చ జరగడం శుభపరిణామం అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సనాతన ధర్మాన్ని వ్యాప్తి చేయడం కోసం, ధార్మిక కార్యక్రమాలను అమలు చేయడం కోసం కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నామన్నారు. గోవా ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్ మాట్లాడుతూ హిందూ సంస్కృతి సాంప్రదాయాలను కాపాడడానికి స్వాతంత్ర్యానికి మునుపే చత్రపతి శివాజీ మహారాజ్ వీరోచిత పోరాటాలను చేశారన్నారు. మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ మాట్లాడుతూ టెంపుల్ కన్వెన్షన్ ద్వారా ఆధ్యాత్మికతను ప్రజల్లోకి తీసుకెళ్లడానికి విస్తత మార్గాలు ఏర్పడతాయన్నారు. సనాతన ధర్మంలో భాగంగా ఆలయాల పునర్జీవనం ఆవశ్యకతను ఆనాడే చత్రపతి శివాజీ మహారాజ్ పాటించారన్నారు. పాశ్చాత్య సాంప్రదాయాలను వీడి సనాతన సాంప్రదాయాలను యువత పాటించాలని, ఇందుకు ధార్మిక కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం ఓ మంచి మార్గం అన్నారు.

ఆధ్యాత్మిక గురువు ఆచార్య స్వామి గోవింద దేవ్ గిర్జి మహారాజ్ మాట్లాడుతూ ఆలయాల నిర్వహణకు టెక్నాలజీ వినియోగం అందుబాటులో ఉన్న నేపథ్యంలో సనాతన ధర్మ పరిరక్షణ, భారత సంస్కృతి సాంప్రదాయాలను భావితరాలకు అందించడానికి చక్కటి వేదిక ఈ మహా కుంబ్ అన్నారు. ఆర్ఎస్ఎస్ జాయింట్ జనరల్ సెక్రటరీ సి ఆర్ ముకుంద మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ఓ ఆలయం ఉండాలని, ఆలయ నిర్వహణకు ఓ భవనం ఏర్పాటు చేసుకొని తద్వారా ఆ ప్రాంతంలో ధార్మిక కార్యక్రమాలను విస్తరింప చేయాలన్నారు. అంత్యోదయ ప్రతిష్టాన్ సంస్థ వ్యవస్థాపకులు గిరీష్ వాసుదేవ్ కులకర్ణి మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ వికసిత్ భారత్ 2047 లో భాగంగా దేశవ్యాప్తంగా సనాతన ధర్మ పరిరక్షణకై ప్రత్యేక కార్యచరణతో పనిచేస్తున్నామన్నారు.

ఈ కార్యక్రమంలో ఇంటర్నేషనల్ టెంపుల్ కన్వెన్షన్ అండ్ ఎక్స్ పో వ్యవస్థాపకులు గిరీష్ వాసుదేవ్ కులకర్ణి, చైర్మన్ ప్రసాద్ లాడ్, కేంద్రమంత్రి పట్నాయక్, మహారాష్ట్ర మంత్రులు సురేష్, విశ్వజిత్, గోవా మంత్రి రోహన్, ఏపీ రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, టిటిడి చైర్మన్ బిఆర్ నాయుడు, ఎమ్మెల్యేలు పులివర్తి నాని, థామస్, నెలవల విజయశ్రీ, బొజ్జల సుధీర్ రెడ్డి, కలికిరి మురళీమోహన్, గురజాల మోహన్, కురుగొండ్ల రామకష్ణ, కోనేటి ఆదిమూలం, మాజీ మంత్రి అమర్నాథ్ రెడ్డి, ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి, టిటిడి బోర్డు సభ్యులు భానుప్రకాశ్ రెడ్డి, జిల్లా అధికారులు పాల్గొన్నారు. అంతర్జాతీయ దేవాలయాల కార్యక్రమంలో పాల్గొనేందుకు సోమవారం మధ్యాహ్నం రేణిగుంట విమానాశ్రయానికి విచ్చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు సాదర స్వాగతం లభించింది.


డిఎం అండ్‌హెచ్‌ఓకి వినతిపత్రం అందిస్తున్న యూనియన్ నాయకులు

వినతుల వెల్లువ

పిజిఆర్ఎస్‌కు 248 అర్జీలు


ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ సుమిత్ కుమార్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ప్రజాసమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) అర్జీల పరిష్కారంపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టి బాధ్యతతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ వివిధ శాఖల జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం ప్రజాసమస్యల పరిష్కారవేదికలో భాగంగా జిల్లా సచివాలయంలోని గ్రీవెన్స్ హాల్‌లో జిల్లా కలెక్టర్, జిల్లా జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరి, అసిస్టెంట్ కలెక్టర్ హిమవంశీ, డిఆర్ఓ మోహన్ కుమార్, ఆర్‌డిఓ శ్రీనివాసులు, డిప్యూటీ కలెక్టర్లు అనుపమ, విజయలక్ష్మి ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల నుంచి అందే ప్రతి అర్జీని త్వరితగతిన పరిష్కరించాలని, అర్జీల పరిష్కారంలో క్షేత్రస్థాయిలో అధికారులు సిబ్బందితో సమన్వయం చేసుకుని అర్థవంతమైన సమాధానాలు ఇవ్వాలన్నారు. పిజిఆర్ఎస్‌లో అందిన అర్జీల పరిష్కారప్రగతిని ప్రతివారం సమీక్షించడం జరుగుతుందని, అర్జీలు రీ ఓపెన్ అయినట్లైతే వాటికి గల కారణాలను వివరించాల్సి ఉంటుందన్నారు. మొత్తం 248 అర్జీలు అందగా శాఖల వారీగా రెవెన్యూ శాఖకు 202, పంచాయతీ రాజ్ 2, పోలీస్ శాఖ 4, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ 1, డిఆర్‌డిఏ 21, డ్వామా 6, డిఎంఅండ్ హెచ్ఓ 2, డిసిహెచ్ఎస్ 3, కాలుష్య నివారణసంస్థ 1, మున్సిపల్ కమిషనర్ చిత్తూరు 2, ఎంపీడీఓ పెద్దపంజాణి 1, ఎంపీడీఓ తవణంపల్లి 1, గృహనిర్మాణ సంస్థ 2 అర్జీలు అందాయి.

అలసత్వం చేయకండి: ఎస్పీ

సోమవారం జరిగిన ప్రజాఫిర్యాదుల పరిష్కారం కార్యక్రమంలో ప్రజల నుంచి 33 ఫిర్యాదులను జిల్లా ఎస్పి మణికంఠ చందోలు స్వీకరించారు. వచ్చిన ఫిర్యాదులన్నింటిపై చట్ట ప్రకారం విచారణ జరిపి నిర్దేశించిన గడువులోగా ఫిర్యాదుదారుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు నేరుగా ఎస్పి, డీఎస్పీ టి.సాయినాథ్‌ని కలిసి తమ సమస్యలను విన్నవించుకున్నారు. మొత్తం 33 ఫిర్యాదులు అందాయని తెలిపారు. చీటింగ్ 1, కుటుంబ తగాదాలు 5, వేధింపులు 1, ఇంటి తగాదాలు 2, భూ తగాదాలు 11, డబ్బు తగాదాలు 8, ఆస్తి తగాదాలు 3, దారి సమస్యలు 2 ఉన్నాయి.


ఫిర్యాదులను స్వీకరిస్తున్న ఎస్పీ మణికంఠ చందోలు

వేగంగా వినతుల పరిష్కారం: కమిషనర్

ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో అందే వినతులను వేగంగా పరిష్కరించాలని కమిషనర్ పి.నరసింహ ప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం నగరపాలక కార్యాలయంలో ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించి నగర ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ప్రజలు అందించిన వినతులపై అక్కడికక్కడే సంబంధిత అధికారులతో చర్చించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకున్నారు. ప్రతి వినతిపై సంబంధిత అధికారులు క్షేత్రస్థాయి పరిశీలన చేసి నివేదిక సమర్పించాలన్నారు. సోమవారం నాటి పీజీఆర్ఎస్ కార్యక్రమంలో రెవెన్యూ 2, ఇంజనీరింగ్ 2 చొప్పున మొత్తం 4 ఫిర్యాదులు అందాయి. సహాయ కమిషనర్ ఎ.ప్రసాద్, ఎంఈ వెంకటరామి రెడ్డి, ఏసీపీ నాగేంద్ర, ఇతర అధికారులు పాల్గొన్నారు.


వినతులను స్వీకరిస్తున్న కమిషనర్ నరసింహ ప్రసాద్

ఆశాలపై పనిభారం తగ్గించాలి

డిఎం అండ్ హెచ్‌ఓకు వినతి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: జిల్లాలో ఆశ కార్మికులపై స్థానికంగా ఉన్న మెడికల్ ఆఫీసర్లు, ఇతర సిబ్బంది పనిభారం పెంచుతూ సంబంధం లేని పనులను చేయించడం దారుణమని, వాటిని మానుకోవాలని సోమవారం ఏపీ ఆశ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో జిల్లా డిఎంఅండ్ హెచ్ఓకి వినతిపత్రం అందించడం జరిగింది. ఈ సందర్భంగా ఆశ యూనియన్ జిల్లా కార్యదర్శి గంగ, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వాడ గంగరాజు, నాయకులు సావిత్రి మాట్లాడుతూ జిల్లాలోని ఆశ వర్కర్లకు సంబంధం లేని పనులు అప్పగిస్తున్నారని, రాత్రులలో డ్యూటీలు వేస్తున్నారని, అన్ని రకాల పరీక్షలు ఆశాల దగ్గర చేయించడం దారుణమన్నారు. గతంలో యూనియన్‌తో అధికారులు చర్చలు జరిపిన సందర్భంగా ఆశాల విధివిధానాలు తెలియజేస్తూ సర్క్యులర్ జారీ చేయడం జరిగిందని గుర్తు చేశారు. ఆ సర్క్యులర్‌లో స్పష్టంగా ఆశాలు అదనపు పనులు చేయరాదని తెలిపినప్పటికీ కిందస్థాయిలో పిహెచ్‌సిలో ఆశాలపై పెత్తనం చెలాయిస్తూ అన్ని రకాల పనులు చేయించడం ఏమిటని ప్రశ్నించారు. ఆ పనులు చేయడం తమ పరిధిలో లేవని చెప్పినప్పటికీ ఆ విధంగా రాతపూర్వకంగా రాసి ఇవ్వండి అని మీ కథ చూస్తామని బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కనీస గౌరవం కూడా ఇవ్వకుండా ప్రవర్తిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. గతంలో ఇచ్చిన సర్క్యులర్‌లోని విధంగా డిఎం అండ్ హెచ్ఓ ఓసారి సర్క్యులర్‌ను విడుదల చేయాలని, ఆశాలను వేధిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే జనాభా ఎక్కువ ఉన్న ప్రాంతాల్లో అదనంగా ఆశా వర్కర్ నియమించి ప్రస్తుతం ఉన్న ఆశాలపై పని భారం తగ్గించాలని కోరారు. ఈ సమస్యలపై డిఎం అండ్ హెచ్ఓ స్పందించి తన పరిధిలో ఉన్న సమస్యలన్నీ పరిష్కారంచేస్తానని హామీ ఇచ్చారు.

విలేకరిపై దాడి అమానుషం

దాడి చేసిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలి: ఎపిడబ్ల్యూజెఎఫ్



చిత్తూరులో నిరసన తెలుపుతున్న జర్నలిస్టులు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: మన్యం జిల్లా పార్వతీపురం ప్రజాశక్తి విలేకరి రామారావుపై దాడి చేసిన అధికార పార్టీ నాయకుడిని వెంటనే అరెస్ట్ చేయాలని కోరుతూ కలెక్టరేట్ ఎదుట ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ నాయకత్వంలో సోమవారం జర్నలిస్టులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఏపీడబ్ల్యూజేఎఫ్ చిత్తూరు నియోజకవర్గ అధ్యక్ష కార్యదర్శులు కేశవులు, బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ప్రజాసమస్యలను వెలుగులోకి తీసుకురావడంతో పాటు అధికారపార్టీ అమలు చేస్తున్న పథకాలను జనంలోకి తీసుకుపోతున్న జర్నలిస్టులపై దాడులు చేయడం సిగ్గుచేటు అన్నారు. జర్నలిస్టులపై దాడులను అరికట్టేలా రాష్ట్ర ప్రభుత్వం జర్నలిస్టుల రక్షణ చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ విధులు నిర్వహిస్తున్న ప్రభుత్వ ఉద్యోగులపై దాడులు చేస్తే ఎలాంటి కఠిన చర్యలు ఉంటాయో అలాంటి చట్టాన్ని వర్కింగ్ జర్నలిస్టులపై దాడులు జరిగితే కఠినంగా చర్యలు తీసుకునేలా చట్టం తీసుకురావాలని కోరారు. జర్నలిస్టుల పోరాటానికి సిఐటియు జిల్లా నాయకులు వాడ గంగరాజు, దళిత సంఘం నాయకులు దామోదర్, భాస్కర్, ధనుంజయరావు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో ఫెడరేషన్ నాయకులు మురళీమోహన్, దినేష్, ఉమాశంకర్, యాగవేందర్ రెడ్డి, నాగరాజు, ఉపేంద్ర, కృష్ణమూర్తిరెడ్డి, దాము, హరిబాబు, సురేంద్ర పాల్గొన్నారు.

కుప్పం రూరల్ : రాష్ట్రంలో విలేకరులపై జరుగుతున్న దాడులను కుప్పం ప్రెస్‌క్లబ్ సభ్యులు తీవ్రంగా ఖండించారు. మన్యం జిల్లా పార్వతీపురం మండల ప్రజాశక్తి విలేకరిపై అదే మండలానికి చెందిన తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు దాడి చేయడం దారుణమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, ప్రభుత్వ అధికారులు స్పందించి పాత్రికేయులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. పార్వతీపురం ప్రజాశక్తి విలేకరిపై దాడి చేసిన నాయకుడిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కోరుతూ కుప్పం మండల తహశీల్దార్ చిట్టిబాబుకు వినతిపత్రాన్ని అందజేశారు. ప్రజాశక్తి విలేకర్లు సుధీర్, సుబ్రమణ్యం, కిరణ్ కుమార్, పీపుల్ పవర్ ఎడిటర్ రవికుమార్, మనం నాగరాజు, ఆంధ్రనాడు లక్ష్మీపతి, ఏ వన్ టీవీ హరినాథ్ గౌడ్, వన్ టీవీ శివ, సూర్య శివ రాయల్, విశాలాంధ్ర ఉదయ్, నేషనల్ రిపోర్టర్ సంతోష్, ఆంధ్రజ్యోతి శ్రీనాథ్, ప్రైమ్ నైన్ టీవీ రామచంద్ర, ఎన్ 3 టీవీ తరుణ్ పాల్గొన్నారు.


తహశీల్దార్‌కు వినతిపత్రాన్ని అందిస్తున్న పాత్రికేయులు

బాలిక మృతికి కారకులను శిక్షించాలి..

- న్యాయం చేయాలని రోడ్డుపై బైఠాయించిన కుటుంబ సభ్యులు
- కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు

ప్రజాశక్తి- పలమనేరు: పలమనేరు రూరల్ మండలం పెంగరగుంట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదివే బాలిక గర్భం దాల్చి ప్రసవ సయంలో మృతి చెందిన అమానుష సంఘటన సోమవారం మండలంలో చోటు చేసుకుంది. పలమనేరు సిఐ నరసింహరాజు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. పలమనేరు మండలం టి ఒడ్డూరు గ్రామానికి చెందిన తిరుమలేష్ కుమార్తె సునీత (15) పెంగరగుంట ప్రభుత్వ ఉన్నత పాఠశాల్లో 10వ తరగతి చదువుతోంది. తల్లిదండ్రులు వ్యవసాయ కూలీలు, కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుండే వారు. ఈ నేపథ్యంలో వారం రోజుల క్రితం సదరు బాలిక బంగారుపాళ్యం మండలం గుంతూరు గ్రామంలోని తన అక్క ఇంటికి వెళ్లింది. శనివారం మూర్ఛవచ్చి పడిపోవడంతో కుటుంబ సభ్యులు వెంటనే బంగారుపాళ్యంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యులు పరీక్షించి బాలిక 8 నెలల గర్భిణి అని, పురిటి నొప్పులు వస్తున్నాయని బాలిక పరిస్థితి విషమంగా ఉందని వెంటనే చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే తమ కూతురు గర్భవతి అని తమకు తెలీదని, రోజూ సాధారణంగా స్కూల్‌కి వెళ్లి వచ్చేదని, తమకు ఎటువంటి అనుమానం కలుగలేదని తల్లిదండ్రులు చెప్పారు. శనివారం రాత్రి బాలికకు చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రిలో ఆపరేషన్ చేసి ప్రసవం చేయగా మగబిడ్డకు జన్మనిచ్చి కోమాలోకి వెళ్లింది. తల్లీబిడ్డల పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం వైద్యులు తిరుపతి రుయాకు రెఫర్ చేశారు. తిరుపతిలో చికిత్స పొందుతూ రక్తస్రావం ఎక్కువ కావడంతో బాలిక మరణించింది. అయితే ఇందుకు కారణమైన వారు ఎవరనే స్పష్టంగా తెలీదని, కేసు నమోదు చేసి అనుమానితులను అదుపులోకి తీసుకుని దర్యాప్తు చేస్తున్నామని, నిందితులపై ఫోక్సో కేసు నమోదు చేస్తామని సిఐ తెలిపారు. పోస్టుమార్టం అనంతరం సునీత మృతదేహాన్ని పలమనేరు టీ వడ్డూరు గ్రామానికి సోమవారం సాయంత్రం తీసుకువచ్చారు. తమ కూతురు మృతికి కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కుటుంబ సభ్యులు రోడ్డుపై బైఠాయించి ధర్నా, రాస్తారోకో చేశారు. పోలీసులు నిందితులపై చర్యలు తీసుకుంటామని వారికి నచ్చజెప్పి అక్కడి నుంచి పంపేశారు. ఈ సంఘటనపై నేషనల్ హ్యూమన్ రైట్స్ క్రైమ్ కంట్రోల్ ఫోర్స్ అధ్యక్షుడు మాదేశ్, ఐద్వా కార్యదర్శి భువనేశ్వరి మాట్లాడుతూ బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని నిందితులకు కఠిన శిక్ష పడాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విజయ్ కుమార్, మండల విద్యాధికారి లీలారాణి వివరణ కోరగా బాలిక సునీత పెంగరగుంట ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్నది వాస్తవమే అని, అయితే చాలా రోజులుగా బడికి సరిగా రావడం లేదని, దాదాపుగా 188 రోజులకు గాను 50 రోజులు మాత్రమే హాజరైందని తెలిపారు. మిగతా విషయాలు తమకు తెలీదని పూర్తి విషయాలు పోలీసుల దర్యాప్తులో తెలియాల్సి ఉందని అన్నారు. అలాగే పలమనేరు ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ మమతా రాణి వివరణ కోరగా బాలికకు సంబంధించి ఎటువంటి చెకప్ రికార్డ్స్ గాని తమ హాస్పటల్‌లో లేవని బాలిక ఎప్పుడు గానీ తమ ఆసుపత్రికి జనరల్ చెకప్ గాని గర్భిణీ చెకప్ గాని రాలేదని స్పష్టం చేశారు.


రోడ్డుపై బైఠాయించి నిరసన తెలుపుతున్న బాలిక కుటుంబ సభ్యులు, గ్రామస్తులు

రాయితీ కవర్లు పంపిణీ



సంతోషికుమారి
ఉద్యాన వన శాఖాధికారిణి

ప్రజాశక్తి-చౌడేపల్లి: మామిడి పంటలో నాణ్యత కోసం రాయితీ కవర్లను పంపిణీ చేయనున్నట్లు ఉద్యానవన శాఖ అధికారిణి సంతోషి కుమారి పేర్కొన్నారు. స్థానిక కార్యాలయంలో ఆమె మాట్లా డుతూ రైతులు మామిడి దిగుబడిలో కాయ నాణ్యత కోసం తొడిగేందుకు కవర్లు ఉపయోగకరంగా వుంటా యన్నారు. ఈ కవర్లను ప్రభుత్వం రాయితీ పోను ఒక్క రూపాయి చెల్లిస్తే అందిస్తారని తెలిపారు. ఆసక్తి కలిగిన రైతులు సమీపంలోని ఆర్‌బికెల్లో సంప్రదించి నమోదు చేయించుకోవాలన్నారు.



డ్రైనేజీ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న టిడిపి నాయకులు

డ్రైనేజీ నిర్మాణ పనుల పరిశీలన

ప్రజాశక్తి -గంగాధర నెల్లూరు: తూగుండ్రం పంచాయతీ కండ్రిగ దళితవాడ వద్ద డ్రైనే జీ పనిని టిడిపి నాయకులు సోమవారం పరిశీలిం చారు. ఈ సందర్భం గా చిత్తూ రు ఎంపీ నిధులు రూ.15 లక్షలతో చేపట్టిన డ్రైనేజి పనులను పరిశీలించారు. ఈ సందర్భం గా టిడిపి నాయకులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చాక గ్రామాల్లో సిమెంట్ రోడ్లు, డ్రైనేజ్ అభివృద్ధి పనులు జోరుగా సాగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్య నిర్వాహక కార్యదర్శి కృష్ణమ నాయుడు, టిడిపి మండల అధ్యక్షుడు స్వామిదాస్, నియోజవర్గ ముస్లిం మైనార్టీ ప్రధాన కార్యదర్శి నియాజ్‌అలీ, జిల్లా క్రిస్టియన్ సెల్ కార్యదర్శి శాంత్ కుమార్, టిడిపి జిల్లా టీఎన్‌టియుసి అధికార ప్రతినిధి జీవరత్నం, మండల బీసీ సెల్ అధ్యక్షుడు జ్యోతి యాదవ్, తూగుండ్రం పంచాయతీ గ్రామ కమిటీ అధ్యక్షుడు నీరజాక్షులు రెడ్డి, బూత్ కన్వీనర్ శంకర్, టిడిపి నేతలు అతేహర్, ఫిరోజ్, రాఘవేంద్ర పాల్గొన్నారు.

పాత స్థలంలోనే ఆరోగ్య కేంద్రం నిర్మించాలి

సర్పంచ్ మురళి

ప్రజాశక్తి- బంగారుపాలెం: పాత స్థలంలోనే నూతన ఆరోగ్య ఉప కేంద్రం నిర్మించాలని మంగళపల్లి సర్పంచ్ కుప్పాలపల్లి మురళి అన్నారు. సోమవారం చిత్తూరు కలెక్టరేట్లో కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చినట్టు ఆయన తెలిపారు . మండలంలోని మంగళపల్లి పంచాయతీలో గత 50 సంవత్సరాల క్రితం ఆరోగ్య ఉపకేంద్రం నిర్మించి ప్రజలకు వైద్య సౌకర్యాలు చేపడుతున్నారని గత ప్రభుత్వంలో దీన్ని జిల్లేడుపల్లి పంచాయతీ కొత్తూరుకు మార్చి నిర్మాణాలు చేపట్టేందుకు ప్రతిపాదనలు చేశారని కానీ నిర్మాణాలు జరగక ఆగిందని తిరిగి దాన్ని రద్దు చేసి మంగళపల్లి పంచాయతీ పాత స్థలంలోనే భవనాన్ని నిర్మించేందుకు అనుమతులు మంజూరు చేయాలని కలెక్టర్‌కు విన్నవించినట్టు ఆయన తెలిపారు. ఈయన వెంట గ్రామస్తులు రవి, గుర్రప్ప, భారతి, గోవిందయ్య, ఉష పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందిస్తున్న కూరగాయల వ్యాపారులు

గేటు రుసుం భారం తగ్గించండి

ఎమ్మెల్యేకు కూరగాయల వ్యాపారుల వినతి

ప్రజాశక్తి -విజయపురం(నగరి): తమకు దినసరి కూరగాయ ల మార్కెట్ గేటు రుసుం భారంగా వుందని చెల్లించలేక పోతున్నామని వచ్చే ఆదాయం రుసుం చెల్లింపునకే సగం సరిపోతోందని వెంటనే తగ్గించాలని కోరుతూ స్థానిక రోజువారీ కూరగాయల మార్కెట్ వ్యాపారులు ఎమ్మెల్యే భాను ప్రకాష్‌కు సోమవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్థానిక మున్సిపాల్టీ కూరగాయల మార్కెట్ కూరగాయలు విక్రయించు కునేందుకు నగరి మున్సిపాల్టీ పరిధిలో ఆర్‌టిసి బస్టాండు ప్రాంగణంలో రోజూ కూరగాయలు అమ్మితే 400 నుండి రూ.500 వరకు వస్తుందని, అందులో 300 నుండి 400 వరకు గేటు రుసుం చెల్లించాల్సి వస్తోందని తెలిపారు. బతుకు తెరువు కోసం కూరగాయలు అమ్మి జీవనం సాగిస్తున్నామని ఇంత నష్టానికి తాము వ్యాపారం కొనసాగించలేమని ఆవేదన వ్యక్తం చేశారు. 2024-2025 మున్సిపాల్టీ టెండరు దారులు దినసరి కూరగాయల విక్రయ దారులపై అధిక భారం వేస్తున్నారన్నారు. రోజంతా అమ్మితే రూ.400 నుంచి రూ.500 వరకు వస్తుందని, అందులో రూ300 నుండి రూ.400 సంత గేటుకు చెల్లించాల్సి వస్తోందని తెలిపారు. ఇంత నష్టానికి తాము ఎప్పుడూ గేట్లు రుసుం కట్టలేదన్నారు. గత ఐదు సంవత్సరాలుగా అధిక రుసుం ముక్కు పిండి వసూలు చేస్తున్నారని స్పందించి తమకు మార్కెట్ గేటు రుసుం తగ్గించాలని వెజిటబుల్ అసోసియే షన్ తరపున ఎమ్మెల్యేకు వినతిపత్రం అందించా మని తెలిపారు. స్పందించిన ఎమ్మెల్యే వెంటనే మున్సిపల్ కమిషనర్‌తో మాట్లాడి తగిన న్యాయం చేస్తానని హామీ ఇచ్చారని సంఘం నాయకులు సంతోషం వ్యక్తం చేశారు.

'మా భూములు కాజేస్తున్నారు'

కలెక్టర్‌ను ఆశ్రయించిన పేదలు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కారవేదిక కార్యక్రమంలో కార్వేటినగరం, గుడిపాల, పెద్దపంజాణి మండలాలకు చెందిన యానాదులు (గిరిజనులు) భూ సమస్యలు పరిష్కరించాలని, ఇటుకల బట్టీల వల్ల కాలుష్యం పెరుగుతోందని, పారిశుధ్య కార్మికులకు గత రెండేళ్లుగా జీతాలు ఇవ్వలేదని వెంటనే జీతాలు ఇప్పించాలని కోరుతూ జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్‌కు అర్జీలు అందజేశారు. కార్వేటి నగరం మండలం కేశవకుప్పం ఎస్టీ కాలనీకి చెందిన పి.సుబ్బమ్మ మాట్లాడుతూ సర్వే నెం. 417/4లో 1.05 సెంట్లు భూమిని ఆమె పుట్టింటి వారు పసుపు కుంకుమ క్రింద ఇవ్వడం జరిగిందని అయితే విఆర్‌ఓ ఆ భూమిని వేరే వాళ్ళ పేరుకు మార్పు చేశారని తెలిపారు. భూమికి సంబంధించిన పట్టాదారు పాసు బుక్కు తన తండ్రి పేరుపై ఉందని, ఆ భూమిని సర్వే చేసి తనకు న్యాయం చేయాలని గత కొన్ని సంవత్సరాలుగా తహశీల్దార్ వద్దకు తిరుగుతున్నా సమస్య పరిష్కారం కాలేదన్నారు. గుడిపాల మండలం గట్రాలమిట్ట ఎస్టీ కాలనీకి చెందిన ఆర్.మణి యానాదులు మా కాలనీలో ఇటుకల బట్టి వేయడం వల్ల పొగ, కాలుష్యం కారణంగా తరచూ తాము అనారోగ్యానికి గురవుతున్నామని తెలిపారు. ఇటుకల బట్టిని ప్రభుత్వ భూమిలో పెట్టుకున్నాడని సంబంధిత అధికారులకు చెబుతుంటే తమపైనే తిరిగి దౌర్జన్యం చేస్తున్నారని దీనిని పరిశీలించి సమస్యను పరిష్కరించాలని కలెక్టర్‌కు అర్జీ అందించారు. పెద్దపంజాణి మండలం బట్టందొడ్డి పంచాయతీలో టి.చెంగల్రాయులు, టి.రెడ్డప్ప ఇద్దరు పారిశుధ్య కార్మికులు గత 8 ఏళ్లుగా పని చేస్తున్నా మని తెలిపారు. గ్రామ సర్పంచ్ తమకు 2 సంవత్సరాలుగా జీతాలు ఇవ్వడం లేదని, అడుతుంటే హేళనగా మాట్లాడు తున్నారని, పని నుంచి తొలగిస్తానని బెదిరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు రావల్సిన జీతాలు ఇప్పించాలని కోరారు.

రెవెన్యూ అర్జీలు నిర్ణీత గడువులోపు పరిష్కరించండి: కలెక్టర్

ప్రజాశక్తి- యాదమరి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన రెవెన్యూ సదస్సులో అందిన అర్జీల పరిష్కారానికి రెవెన్యూ యంత్రాంగం ప్రత్యేక శ్రద్ధపెట్టి పనిచేయాలని కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. సోమవారం జిల్లా కలెక్టర్, జిల్లా జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరితో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రెవెన్యూ సదస్సులలో అందిన అర్జీలు పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలు, ఫైల్ పెండెన్సీ, 22ఎ ఫైల్స్, మ్యూటేషన్స్‌కు సంబంధించిన అంశాలపై ఆర్డీఓలు, తహశీల్దార్లు, డిప్యూటీ తహశీల్దార్, ఆర్ఐలు, మండల సర్వేయర్లు సంబంధిత రెవెన్యూ సిబ్బందితో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ రెవెన్యూ సదస్సులలో అందిన అర్జీల పరిష్కారానికి ఆర్డీఓలు, తహసీల్దార్లు ప్రత్యేక శ్రద్ధ పెట్టి పనిచేయాలని, ప్రతి అర్జీకి ఇచ్చిన ఎండార్స్మెంట్లను ఆడిట్ చేయడం జరుగుతుందని, సంబంధిత ఆర్డీఓలు వారి పరిధిలోని మండలాలలో పర్యటించి ఎండార్స్మెంట్లను పరిశీలించాలని అన్నారు. ఎండార్స్మెంట్లు నాణ్యతతో అర్థవంతంగా ఉండాలని, రీ ఓపెన్‌కి అవకాశం లేకుండా అర్జీదారుని సంతృప్తి చెందేలా పరిష్కారం చూపాలని ఈ దిశగా పనిచేయాలని ఆదేశించారు. ఎండార్స్మెంట్ ఇచ్చే విషయంలో వీఆర్వోలకు తహశీల్దార్లు అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఈ అర్జీల పరిష్కారానికి ఒక ప్రణాళిక ప్రకారం మార్చి 8వ తేదీలోపు పూర్తి చేసేలా ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని ఆదేశించారు. ఇంటి పట్టాల నిమిత్తం దరఖాస్తు చేసుకున్న వారికి అసైన్మెంట్ కమిటీలో ఆమోదం అనంతరం అర్హులకు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఫైల్ పెండెన్సీ లేకుండా పనిచేయాలని, మీ సేవా నుంచి రెవెన్యూ సేవల నిమిత్తం



వీడియో కాన్ఫరెన్సులో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

అందే అర్జీలను సకాలంలో పరిష్కరించేందుకు క్షేత్ర స్థాయిలో పరిశీలించాలన్నారు. జనన ధృవపత్రాలు మంజూరు, ఆర్ఓఆర్, మ్యూటేషన్స్, 22ఎ ఫైల్స్ సంబంధించి తహశీల్దార్లు క్షేత్రస్థాయిలో పరిశీలించి వాస్తవ పరిస్థితులను తెలుసుకొని ఫైల్స్‌ను పూర్తి చేయాలన్నారు.

బాల్య వివాహాలు నివారించాలి: ఆర్‌డీవో

ప్రజాశక్తి- విజయపురం: బాల్య వివాహాలను నివారించాలని, బాల్య వివాహాలు చేస్తున్న సమాచారం తెలిస్తే వెంటనే సమీపంలోని అంగన్‌వాడీ సీడీపీవోకు, మహిళా పోలీసులకు ఫిర్యాదు చేయాలని ఆర్‌డీవో భవాని శంకరి పేర్కొన్నారు. మండలంలోని మహావీరపురం, క్షూరికాపురం గ్రామాల అంగన్ వాడీ కేంద్రాలను ఆర్డీవో భవాని శంకరి సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయా కేంద్రాల్లోని రికార్డులు పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించి ఇంకా ఎక్కువ మంది పిల్లలను అంగన్ వాడీ కేంద్రానికి వచ్చేలా చేయాలన్నారు. మూడు సంవత్సరాలు నిండిన పిల్లలను అంగన్‌వాడీ కేంద్రంలో చేర్చాలని ఆమె సూచించారు. పిల్లలకు మంచి పోషక ఆహారాన్ని అందించాలని, గర్భిణులకు పాలు, గుడ్లు క్రమం తప్పకుండా అందించాలని ఆమె పేర్కొన్నారు. బాల్య వివాహాలను నివారించాలని అలాంటి సమాచారం ఎవరికైనా తెలిస్తే సమీపంలోని అంగన్‌వాడీ సూపరువైజరు, సిడిపిఒ, మహిళా పోలీసులకు తెలపాలని ఆమె సూచించారు. ప్రభుత్వ పాఠశాలలను కూడా ఆమె తనిఖీ చేసి మధ్యాహ్నం భోజనం మెనూను తప్పకుండా పాటించాలని ఆదేశించారు. పిల్లలకు మరుగుదొడ్లు శుభ్రంగా ఉండేలా చూడాలని ఆమె ఎంఈఓను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రాజేంద్ర, తమశీల్దారు కిరణ్, ఎంఈఓ2 హరిప్రసాద్ వర్మ , అంగన్‌వాడీ సూపరువైజరు లక్ష్మి , పంచాయతీ కార్యదర్శిలు సురేంద్ర కుమార్, చిరంజీవి, సెల్వం, జయప్రకాష్, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.



అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న నగరి ఆర్‌డివో భవాని శంకరి

చౌడేపల్లి: బాల్య వివాహాలు అనర్థదాయకమని తల్లిదండ్రు లు బాల్య వివాహాల జోలికి వెళ్లకూడదని ఐసిడిఎస్ సిడిపిఒ రాజేశ్వరి పేర్కొన్నారు. స్థానిక ఉన్నత పాఠశాల విద్యార్థులకు పది అంశాలపై సోమవారం అవగాహన కల్పించారు. బాల్య వివాహాల వల్ల జరిగే అనర్థాలను వివరించారు. చిన్నతనంలోనే పెళ్లిళ్ల చేయడం వల్ల బాలికల్లో వ్యాధి నిరోధక శక్తి తగ్గి అనేక సమస్యలు ఎదుర్కొంటారని వివరించారు. పౌష్టికాహార లోపం, పోక్సో చట్టం, గుడ్ టచ్, బ్యాడ్ టచ్, వ్యక్తిగత పరిశుభ్రత వంటి వాటి గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు నాగరాజు రెడ్డి, ఏసీడీపీఓ అమర జ్యోతి, సూపరువైజర్లు సులోచన, రమాదేవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



చౌడేపల్లిలో



సిఎంకు స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

చంద్రబాబును కలిసిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి -పలమనేరు: తిరుపతిలో నిర్వహించిన అంతరా జ్తీయ దేవాలయాల సమ్మేళనానికి విచ్చేసిన ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబుకు రేణిగుంట విమానాశ్రయంలో జిల్లా ప్రముఖులు సోమవారం ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పలమనేరు ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి ముఖ్యమంత్రికి స్వాగతం పలికారు. అనంతరం సిఎంతో కలిసి తిరుపతిలోని ఆశ కన్వెన్షన్ సెంటర్లో నిర్వహించిన అంతర్జాతీయ దేవాలయాల సమ్మేళనంలో ఎమ్మెల్యే అమరనాథరెడ్డి పాల్గొన్నారు.

ఐరాల: ముఖ్యమంత్రి చంద్రబాబుకు పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్ పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సిఎం ఎమ్మెలను అప్యాయంగా పలకరించి పూతలపట్టు అభివృద్ధిపై చర్చించారు.



ప్రకృతి వ్యవసాయంతో పండించిన కూరగాయలు విక్రయిస్తున్న రైతులు

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యం

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: ప్రకృతి వ్యవసాయంతోనే ఆరోగ్యమని పిఆర్‌పి అంబికా గాంధీ పేర్కొన్నారు. మండల కార్యాలయంలో మండలంలోని చిత్రం బొమ్మాయిపల్లి, గోవర్ధనగిరి, కల్లూరుపల్లి గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయంతో సాగు చేసిన కూరగాయలు సోమవారం విక్రయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యంగా వుంటారని ప్రతి ఒక్కరూ రసాయనాలు లేని ప్రకృతి ఫలాల వల్ల జీవన ప్రమాణం పెంపొందు తుందన్నారు. ప్రతి ఒక్కరూ ప్రకృతి సేద్యంపై అవగాహన పెంచుకొని పంటలు సాగు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ రైతులు రాజేంద్ర నాయుడు, జ్ఞానశేఖం, చిత్రమ్మ, విజయలక్ష్మి పాల్గొన్నారు.



గంగ జాతరలో ఎమ్మెల్యే

ప్రజాశక్తి -పలమనేరు: పలమనేరు మండలంలోని కొలమాసన పల్లి, గొల్లపల్లిలో సోమవారం గంగ జాతరలో పలమనేరు ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకొని పూజలు నిర్వహించి నిర్వహిం చారు. ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకున్నా నని తెలిపారు. ఈ సందర్భంగా జాతర నిర్వహకులు, గ్రామస్థులు ఆయనను ఆలయ మర్యాదలతో సన్మానించి తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు టిడిపి నాయకులు నాగరాజు రెడ్డి, గణేష్, వెంకట రత్నం, జగదీష్ నాయుడు, సుబ్రహ్మణ్యం, రామూర్తి నాయుడు, సెల్వరాజ్, వెంకటముని రెడ్డి, నరేష్ రెడ్డి, మాజీ సర్పంచ్ బాబు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి ఉపన్యాసం

ప్రజాశక్తి -విజయపురం (నగరి): నగరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం అతిథి ఉపన్యాసం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పరీక్షలకు సంసిద్ధం కావలసిన విధానాన్ని వివరించారు. ముఖ్య అతిథిగా హాజరైన విశ్రాంతి ఐఎఎస్ అధికారి డాక్టరు ఎస్ చెల్లప్ప మాట్లాడుతూ జ్ఞాన సముపార్జనపై ఆసక్తి కలిగి వుండాలని ఆర్జించిన జ్ఞానాన్ని నిరంతరం మననం చేసుకోవాలని సూచించారు. సమయపాలనను పాటించడం వంటివి ఆచరించినప్పుడే విద్యార్థులు సర్వతో ముఖంగా అభివృద్ధి చెందుతారని వారు పిలుపు నిచ్చారు. డాక్టరు చెల్లప్ప ప్రభుత్వ అధ్యాపకులుగా, ఆచార్యులుగా, విశ్వవిద్యాలయం ఉపకులపతిగా, కలెక్టర్ గా, ఎస్‌ఇ అండ్ ఎస్‌టి కమిషన్ సెక్రటరీగా వివిధ హోదాలలో సేవలు అందించారని, ఇప్పటికీ వెనుకబడిన వారికి ఆర్థిక సాయం, ఆహార సమస్య ఉన్నవారికి బియ్యం అందించడం, విద్యార్థు లలో అత్యధిక మార్కులు పొందిన వారికి ప్రోత్సాహ కంగా ఉన్నత విద్యకు ఆర్థికంగా సహాయ పడటం, లాంటివి



మాట్లాడుతున్న రిటైర్డు ఐఎఎస్ ఆఫీసర్ డాక్టరు ఎస్ చెల్లప్ప

వీరి సామాజిక సేవకు తార్కాణం అని వక్తలు పేర్కొన్నారు. ద్రవిడ విశ్వవిద్యాలయం ఆచార్యులు ఆత్మీయ అతిథి గణేష్ మూర్తి తమ అమూల్యమైన సందేశం అందించారు. కళాశాల అధ్యక్షులు డాక్టర్ ఆర్ వేణుగోపాల్ సభకు అధ్యక్షత వహించారు. ఇలాంటి మార్గదర్శకుల సలహాలను అనుసరించి విద్యార్థులు ప్రగతి పథం వైపు పయనించాలని పిలుపు నిచ్చారు. ఉపాధ్యక్షులు భాస్కర్ రాజు, ఐక్యూఎసి కోఆర్డినేటర్ ఇందిరా ప్రియదర్శిని, తెలుగు విభాగ అధిపతి డాక్టర్ ఎస్ చిన్న పాపమ్మ, తమిళ విభాగం అధిపతి ఇఎన్ జ్యోతి, ఇతర అధ్యాపకులు, అధ్యాపకేతర బృందం, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామ అభివృద్ధే ధ్యేయం: ఎమ్మెల్యే

ప్రజాశక్తి -గుడిపాల : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొమ్మిది నెలల్లోనే పల్లెల్లో అభివృద్ధి పనులు పూర్తిచేశాం.. పల్లెలకు నిజమైన అభివృద్ధి పండగను తీసుకొచ్చామని చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ అన్నారు. గుడిపాల మండల పరిధిలో 11 గ్రామాల పరిధిలో రూ.1.44 కోట్ల రూపాయలతో చేపట్టిన సిమెంట్ రోడ్లు, గ్రామ సచివాలయ భవనం, ప్రహరీ నిర్మాణాలకు ఆయన సోమవారం ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గడిచిన ఐదేళ్ల వైసిపి పాలనలో గ్రామీణ పాలన, అభివృద్ధి పూర్తిగా నిర్లక్ష్యానికి గురైందన్నారు. ఐదేళ్ల కాలంలో ఎక్కడా ఒక సిమెంట్ రోడ్డు కూడా వేయలేదని, కూటమి ప్రభుత్వం గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనలు కల్పిస్తోందన్నారు. గుడిపాల మండలంలో సుమారు 7 కోట్ల రూపాయలు ఖర్చు చేశా మని, ఎన్నికల హామీలు అమలు చేస్తున్నామని రాబోయే మూడు నెలల్లో మిగిలిన హామీలు అమలు చేస్తామన్నారు. అన్ని వర్గాల వారికి పథకాలు అందిస్తామన్నారు. కొత్తకోట, సీఎం కొత్త ఇండ్లు, గంగనపల్లి,13 గొల్లపల్లి, రాగిమాను



అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవం చేస్తున్న ఎమ్మెల్యే జగన్ మోహన్

పెట్టడ, బంధార్లపల్లి, మరకాలకుప్పం, గట్రాళ్లమిట్ట, మండి కృష్ణాపురం గ్రామాల్లో సిమెంట్ రోడ్లు, 197 రామాపురంలో శ్మశాన ప్రహరీ, కుప్పిగానిపల్లిలో గ్రామ సచివాలయ భవనాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శివరాజ్, తహశీల్దారు జయంతి, డీఈలు నవీన్ కుమార్, ప్రసాద్ నాయుడు, మాజీ జెడ్పీటీసీ సుమతీ, టిడిపి నాయకులు సుబ్రహ్మణ్యం నాయుడు , అనిల్, జయలక్ష్మి, స్థానిక సర్పంచులు మధుసూదన్ రాయల్, ఎంపీటీసీలు హరిప్రసాద్, ఉమ్మడి పార్టీల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఉన్నత విద్యతో ఉత్తమ భవిష్యత్ : కొమ్మినేని కుషాల్

ప్రజాశక్తి- కుప్పం టౌన్ : ఉత్తమ విద్యతోనే ఉన్నత భవిష్యత్తు ఉంటుందని కుప్పం పట్టణానికి చెందిన యువ చార్టెడ్ అకౌంటెంట్ కొమ్మినేని కుషాల్ తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ ఒకేషనల్ ఇంటర్మీడియట్ కళాశాల గ్రంథాలయానికి లక్ష రూపాయలు విలువచేసే చార్టెడ్ అకౌంటెంట్ పుస్తకాలను సోమవారం ఆయన విరాళంగా అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తును ఇంటర్మీడియట్ నిర్ణయిస్తుందని, ఇంటర్ ముగిసిన అనంతరం విద్యార్థులు తమ భవిష్యత్తును ఎంచుకునే అవకాశం ఉంటుందన్నారు. సీఏ కోర్సు కష్టతరమే అయినా, కోర్సు పూర్తి పూర్తిచేస్తే బంగారు భవిష్యత్తు ఉంటుందని తెలిపారు. తన తండ్రి బలరామ్ ఆర్టీసీ కార్మికుడిగా ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొని తనను చదివించారని తెలిపారు. తన చదువు పూర్తి కావడంతో తాను చదువుకున్న పుస్తకాలు పేద విద్యార్థులకు ఉపయోగ పడాలన్న ఉద్దేశంతో పుస్తకాలను ప్రభుత్వ కళాశాల గ్రంథాలయానికి విరాళంగా ఇచ్చానని తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్, అధ్యాపకులు దాతలను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జ్యోతిష్వరన్, అధ్యాపకులు జగదీష్ బాబు, కార్తీక్, త్రివిక్రమ్, కుమార్, ఆర్టీసీ కార్మిక నాయకులు బలరాం, ఆర్‌సిరెడ్డి పాల్గొన్నారు.



కళాశాల గ్రంథాలయానికి పుస్తకాలు అందిస్తున్న కొమ్మినేని కుషాల్

నీటిని ఒడిసిపట్టడమే వాటర్ షెడ్ ఉద్దేశం

ప్రజాశక్తి -సోమల: భూగర్భ జలాలను సక్రమంగా వినియోగించుకుని పరుగెత్తే నీటిని ఒడిసిపట్టి, పట్టిన నీటిని అక్కడికక్కడే ఇంకింప చేయడమే వాటర్ షెడ్ పథకం ఉద్దేశం అని సూపరింటెండెంట్ వెంకట్రామిరెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రమైన సోమల లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వాటర్‌షెడ్ యాత్రను నిర్వహించారు. వర్షపు నీటిని వృథా చేయకుండా భూమిలో ఇంకెలా చేసి భూగర్భ జలాలను పెంపొందించుకోవచ్చునని ఇందు కోసం రైతులు వాటర్ షెడ్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వాటర్షెడ్ పథకంలో రైతులకు అవసరమైన వ్యవసాయ పనిముట్లు సబ్సిడీతో అందిస్తారని రైతులు వాటర్షెడ్ అధికారులను సంప్రదించి పనిముట్లను సబ్సిడీ ద్వారా కొనుగోలు చేసుకుని వ్యవసాయంలో ఉపయోగించుకోవచ్చన్నారు. రైతులకు అవగాహన కల్పించడం పాఠశాల విద్యార్థులచే ర్యాలీ నిర్వహించారు. ప్రధానమంత్రి కృషి సంచార యోజన వాటర్ షెడ్ పథకం లో రైతులకు ఉపయోగకరమైన



ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, విద్యార్థులు

పథకాలు ఉన్నాయని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో నారాయణ కోరారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. సర్పంచి రాజేశ్వరమ్మ, వైస్ ఎంపీపీ ప్రభాకర్ , వాటర్ షెడ్ పిఓ శోభారాణి, నాయకులు పీఎం మల్లికార్జున, గన్నా మదన్మోహన్, బాబు, రైతులు పాఠశాల ఆవరణంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో వాటర్షెడ్ చైర్మన్ సుమలత, నాయకులు మహేంద్ర శంకర జనార్ధన్ రైతులు పాల్గొన్నారు.

క్రైం న్యూస్

చెరువులో మునిగి వ్యక్తి మృతి

ప్రజాశక్తి- తవణంపల్లి: మేతకు తీసుకెళ్లిన ఆవు చెరువులో మునగడంతో రక్షించే ప్రయత్నంలో ఓ వ్యక్తి నీట మునిగి మృతి చెందిన సంఘటన మండలంలో సోమవారం చోటు చేసుకుంది. తవణంపల్లె మండలం తెల్లగుండ్లపల్లెకు చెందిన లోకనాథ నాయుడు (46) తన సోదరుడు ప్రభాకర్ నాయుడు తమ ఆవులను కొండమ్మ నాయుడు చెరువు శుభ్రపరచడానికి తీసుకువెళ్లారు. ఒక ఆవు చెరువులోకి వెళ్లింది. లోకనాథ నాయుడు దాన్ని రక్షించడానికి చెరువులోకి దిగాడు. ప్రమాదవశాత్తు చెరువులో చిక్కుకున్నాడు. ఎంతకీ బయటకు రాకపోవడంతో లోకనాథ నాయుడు భార్య వరకుమారి తన భర్త చెరువులో మునిగి పోయాడని పోలీసులకు ఫిర్యాదు చేసింది. అప్రమత్తమైన అగ్ని మాపక శాఖ సిబ్బంది, పోలీసులు సంఘటన స్థలం వద్దకు చేరుకున్నారు. అగ్ని మాపక సిబ్బంది సాయంతో లోకనాధనాయుడు మృత దేహాన్ని బయటకు తీశారు. మృతుడు చెరువులో ఊపిరి ఆడక మృతి చెందాడని వారు పేర్కొన్నారు. ఎస్ఐ చిరంజీవి కేసు దర్యాప్తు చేస్తున్నారు.



కడా పీడీకి వినతిపత్రం అందిస్తున్న ఎంఆర్‌పిఎస్ నాయకులు

సొంతింటి కల సాకారానికి సహకరించండి

ప్రజాశక్తి-కుప్పం రూరల్ : సొంతింటి కల సహకారం చేయాలని కోరుతూ కుప్పం మండలం వి మిట్టపల్లి పంచాయతీకి చెందిన ఎస్టీ గ్రామ వాసులు ఎమ్మార్పీఎస్ చిత్తూరు జిల్లా అధ్యక్షులు ప్రకాష్ ఆధ్వర్యంలో కడా పీడీ వికాస్ మరమత్ కు వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఎంఆర్పిఎస్ చిత్తూరు జిల్లా అధ్యక్షులు మాట్లాడుతూ వి మిట్టపల్లి ఎస్టీ గ్రామస్తులు గత 15 సంవత్సరాలుగా ఇంటి స్థలాలు లేకుండా ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. వీరి సమస్యలను ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా కడా పీడీకి వినతి పత్రం అందించామన్నారు. వీరి సమస్యలను విన్న కడా పీడీ సానుకూలంగా స్పందిస్తూ ఎస్టీ సామాజిక వర్గానికి చెందిన వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో నారాయణప్ప, నాగమ్మ, శివగామి, మదేశ్వరి, మలర్, సుజాత, కనగా, మరియమ్మ, బసమ్మ, మల్లిగా, అఖిల, సుప్రియ, దేవమ్మ, కస్తూరి, మరియమ్మ, పి అను, మరియప్ప పాల్గొన్నారు.



మండల సమావేశంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు

మండల అభివృద్ధిపై దృష్టి పెట్టండి: ఎంపీపీ

ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం : మండల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో కలిసిమెలిసి అభివృద్ధికి సహకరించాలని ఎస్ఆర్‌పురం ఎంపీపీ సరిత పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రం ఎస్ఆర్ పురం ఎంపీడీవో కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా అన్ని శాఖల అధికారులు వారి అభివృద్ధి కార్యక్రమాల గురించి ఎంపిపి తెలిపారు. వేసవిలో తాగు నీటికి ఇబ్బంది ఉంటే అధికారుల దృష్టికి తేవాలని వెంటనే తాగునీటి సౌకర్యం కల్పిస్తామని ఎంపీడీవో మోహన మురళి తెలిపారు. రెవెన్యూ సమస్యలు ఏదైనా ఉంటే తన దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కారానికి కృషి చేస్తానని తహశీల్దారు లోకనాథ పిళ్ళై తెలిపారు. ఈవోపీఆర్డి కోదండరామిరెడ్డి మాట్లా డుతూ గ్రామ పంచాయతీలలో పారిశుధ్య కార్యక్రమాలు సక్రమంగా నిర్వహించాలని సూచించారు. నీటి ట్యాంకులు 15 రోజులకు ఒకసారి శుభ్రం చేయాలని, పరిశుభ్ర తాగునీరు అందించా లన్నారు. ఎస్ డబ్ల్యుపిసి సెంటర్లో అన్నీ ఫిబ్రవరి నాటికి పూర్తి స్థాయిలో పనిచేయాలని, తడి చెత్త పొడి చెత్త సేకరించి తద్వారా ఘన వ్యర్థ పదార్థాల నిర్వహణ కేంద్రాలకు తరలించి వాటి ద్వారా వర్మి కంపోస్టు మొదలైన తయారు చేయాలని సర్పంచులకు తెలిపారు. ఎక్కాడా చెత్త లేకుండా చెత్త రహిత గ్రామ పంచాయతీలుగా తీర్చిదిద్దాలన్నారు. 15 రోజులకు ఒకసారి నీటి ట్యాంకులను శుభ్రపరిచి క్లోరినేషన్ చేయించి ప్రజలకు శుభ్రమైన తాగునీరు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి ప్రసాద్ రెడ్డి, వ్యవసాయ అధికారి నర్మదా, ఏపిఎం రోజా, ఏపీవో చంద్రశేఖర్, పశువైద్యాధికారి విద్య శ్రీ, విద్యుత్ శాఖ, విద్యాశాఖాధికారులు పాల్గొన్నారు.



ఆలయ నిర్మాణ శంకుస్థాపనలో పాల్గొన్న ఎమ్మెల్యే, అధికారులు

ఆంజనేయ స్వామి ఆలయ పునర్నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-ఐరాల: కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానం అనుబంధంగా ఉన్న ఆంజనేయ స్వామి ఆలయ పునర్నిర్మాణానికి సోమవారం ఉదయం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమానికి పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్, కాణిపాకం ఆలయ ఈవో పెంచుల కిషోర్ హాజరయ్యారు. వేకువజామున వేదపండితుల వేద మంత్రోచ్చారణ మధ్య ఉదయం ఆంజనేయ స్వామి ఆలయ శంకు స్థాపనను అర్చకులు నిర్వహించారు. ఈ ఆలయ పునర్నిర్మా ణానికి అమెరికాకు చెందిన భక్తుడు అనిల్ కుమార్ దాతగా వ్యవహరించారు. దాదాపు రూ.1.10 కోట్లు (కోటి పది లక్షల రూపాయలు) వ్యయంతో ఆలయ నిర్మాణ పనులు చేపట్టారు. అనంతరం అక్కడ నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పూతల పట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ పాల్గొని వినాయకుడిని దర్శించు కున్నారు. వేద పండితులు వేద ఆశీర్వాదం అందించారు. ఆలయ ఈవో పట్టు వస్త్రంతో సత్కరించి స్వామి తీర్థ ప్రసాదాలు అందిం చారు. ఈ కార్యక్రమంలో కాణిపాకం దేవస్థానం ఈవో పెంచల కిషోర్, ఆలయ అర్చకులు, వేద పండితులు, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

భక్తులకు అన్నదానం

ప్రజాశక్తి -వెదురుకుప్పం: మండలంలోని, మాంబేడు పంచాయతీ, దుద్దేరామనాయుడు కండ్రిగ సమీపంలో అరుణ గిరిపై వెలసిన జ్ఞాన ప్రసూనాంబ సమేత కొండ మల్లేశ్వర స్వామి ఆలయం వద్ద సోమవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. అరుణగిరి క్షేత్ర వ్యవస్థాపక ధర్మకర్తలు జ్ఞానప్రసూన రెడ్డి, కుటుంబ సభ్యులు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఉదయం స్వామికి అభిషేకం చేసి వివిధ మాలలతో సుందరంగా అలంకరించి, నైవేద్యం సమర్పించి , వేద మంత్రోచ్చారణ మధ్య పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంచిపెట్టారు. మధ్యాహ్నం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ పెద్దలు పాల్గొన్నారు.